క్లుప్తంగా

జీపీ భవన నిర్మాణ పనులు ప్రారంభం



దుగ్గొండి: మండలంలోని తొగర్రాయి గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరయ్యాయి. ఈమేరకు శుక్రవారం సర్పంచ్ ఓడేటి తిరుపతిరెడ్డి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ ఇజ్జగిరి, ఏఈ వెంకటేశ్వర్లు, రైతు బంధు జిల్లా డైరెక్టర్ కాట్ల భద్రయ్య, ఉప సర్పంచ్ తుమ్మలపెల్లి మహేందర్, పంచాయతీ కార్యదర్శి వాణి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రూప్‌-2 పరీక్షను వాయిదా వేయాలి

దుగ్గొండి: గ్రూప్‌–2 పరీక్షను ప్రభుత్వం వాయిదా వేయాలని బహుజన సమాజ్ పార్టీ నాయకుడు గజ్జి దయాకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఆగస్టు 29, 30 తేదీల్లో గ్రూప్‌–2 పరీక్ష తేదీలను ఖరారు చేశారని, అయితే 23వరకు గురుకుల బోర్డుకు సంబంధించిన పరీక్షలు ఉన్నాయన్నారు. రెండు రకాల పరీక్షలకు ఒకే సారి సన్నద్ధం కావడం సాధ్యం కాదని కావున వాయిదా వేయాలని కోరారు. పేపర్ లీకేజీ ఘటనతో అభ్యర్థులు మూడు నెలలు మానసిక ఆందోళనకు గురయ్యారని తెలిపారు. మరో మూడు నెలలు పరీక్షను వాయిదా వేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏసీపీని కలిసిన మాల మహానాడు నాయకులు

నర్సంపేట: నర్సంపేట నూతన ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన తిరుమల్, సీఐ రవికుమార్, టౌన్ ఎస్సై శీలం రవిలను మాల మహానాడు నాయకులు శుక్రవారం వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సాధు నర్సింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోతి విష్ణు, కార్యదర్శి కమలాకర్, డివిజన్ అధ్యక్షుడు కుమార్, కడగండ్ల అశోక్‌రావు, యశోద నర్సింగం, కడగండ్ల యాకయ్య, బక్కి కుమారస్వామి, కిరణ్, స్వామి పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడి మృతి


నర్సింహారాములు(ఫైల్)

నెక్కొండ: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు రాపాక నర్సింహారాములు (88) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. నర్సింహారాములు మృతి ఉపాధ్యాయ లోకానికి, పీఆర్టీయూ సంఘానికి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈసందర్భంగా మృతదేహాన్ని సందర్శించిన ఆయన, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో టీపీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి, రాము, రమేష్ యాదవ్, మల్లయ్య, అశోక్, హరీశ్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నియామకం

వర్ధన్నపేట: పట్టణానికి చెందిన కందుగుల నర్సయ్యను రైతు సమన్వయ సమితి పట్టణ అధ్యక్షుడిగా నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను శుక్రవారం ఎమ్మెల్యే అరూరి రమేష్ నర్సయ్యకు అందచేశారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మంచాల రామకృష్ణ, తుమ్మల రవీందర్, నాయకులు తుమ్మల యాకయ్య, కుమారస్వామి, చందు సాయిలు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

నల్లబెల్లి: మద్యానికి బానిసై అనారోగ్యానికి గురైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నల్లబెల్లి మండలంలోని కొండాయిల్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై నగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండాయిల్‌పల్లి గ్రామానికి చెందిన ఎద్దు కుమార్ (45) తనకున్న భూమిలో వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగించేవాడు. గత కొంత కాలంగా మద్యానికి బానిస కావడంతో అనారోగ్యానికి గురయ్యాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో ఏ పని చేయలేక ఇంటివద్దే ఉండేవాడు. దీంతో మనస్తాపానికి గురై గురువారం ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుమార్ చికిత్స పొందుతు శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డాక్టర్ కావలెను..

- ఏళ్ల తరబడి ఇన్‌చార్జ్‌ల చేతుల్లో భాంజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులు

నర్సంపేట రూరల్ : గ్రామీణ ప్రజలకు నిత్యం వైద్య సేవలు అందించే ప్రాథమిక ఆస్పత్రిలో రెగ్యులర్ వైద్యుడు లేకపోవడంతో రోగులకు తిప్పలు తప్పడంలేదు. నర్సంపేట మండలంలోని భాజంపేట గ్రామ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి 8 సంవత్సరాలుగా ఇన్‌చార్జ్ వైద్యులతోనే కాలం వెళ్లదీస్తుండడం గమనార్హం. రెగ్యులర్ వైద్యులు ఇక్కడ డ్యూటీ చేసిన దాఖలాలులేవు. వచ్చినా.. కొద్దిరోజులకే డిప్యూటేషన్‌పై వెళ్తుండగా సమీప కేంద్రాల వైద్యులకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తున్నారు. అయితే వారు భాంజీపేటకు చుట్టపుచూపుగా కూడా రాకపోగా.. పరిపాలనా సంబంధ అంశాలు, పనులను సైతం తాము విధులు నిర్వర్తించే కేంద్రం నుంచే చేస్తుండడం గమనార్హం. ఏదైనా ఒక సంతకం అవసరం ఉన్నా.. భాంజీపేట ఆస్పత్రి సిబ్బంది సదరు ఇన్‌చార్జ్ పనిచేసే ప్రాంతానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నట్లు సమాచారం. అప్పట్లో రెగ్యులర్ వైద్యుడు శ్రీనివాస్ ఉండగా విధులకు సరిగా రాకపోవడంతో నాటి కలెక్టర్ వాకటి కరుణ అతన్ని డిప్యూటేషన్‌పై పంపించారు. తర్వాత కొంతకాలం నెక్కొండ మండలంలోని అలంకానిపేట పీహెచ్‌సీ వైద్యుడు పూర్తిస్థాయి ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వర్తించాడు. అయితే అతనికి పీజీ సీటు రావడంతో వెళ్లిపోయాడు. అనంతరం మరో ఇన్‌చార్జ్‌కి బాధ్యతలు అప్పగించారు. వారు కూడా కొద్దిరోజులు చేసి వెళ్లిపోయారు. దీంతో చెన్నారావుపేట మండలం పీహెచ్‌సీ వైద్యుడు వీరేన్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. విధులు నిర్వహిస్తుండగా నర్సంపేట సివిల్ ఆస్పత్రికి బదిలీపై వెళ్లడంతో మళ్లీ భాంజీపేట ఆస్పత్రికి వైద్యుడు కరువయ్యారు. చివరకు ఖానాపురం మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి చెందిన భూపేష్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అనంతరం పూర్తి బాధ్యతలు అప్పగించడంతో మూడు సంవత్సరాలు పని చేశారు. ఆతర్వాత రెగ్యులర్ వైద్యుడిగా అరుణ్‌చంద్రను ప్రభుత్వం నియమించింది. ఆరునెలలు చేసి డిప్యూటేషన్‌పై ఎంజీఎంకు వెళ్లడంతో మళ్లీ డాక్టర్ పోస్టు ఖాళీ అయింది. దీంతో నల్లబెల్లికి చెందిన వైద్యుడు ఆచార్యకు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించగా.. అదనపు బాధ్యతలు నిర్వర్తించలేనని చెప్పాడు. దీంతో అతనికి సిబ్బంది వేతనాలు, పాలన వ్యవహారాలు మాత్రమే అప్పగించారు. ఆస్పత్రికి వచ్చిన ఓపీ, గర్భిణీల చెకప్‌లను ఆస్పత్రి ఆవరణలో ఉన్న ఆయూష్ వైద్యురాలు అనితకు అప్పగించారు. రెగ్యులర్ వైద్యుడు లేకపోవడంతో రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయిలో రెగ్యులర్ వైద్యుడిని నియమించాలని పలువురు డిమాండ్ చేశారు.

5 సబ్ సెంటర్లు, 9 పల్లె దవాఖానాలు

భాంజీపేట ఆస్పత్రి కింది మొత్తం 5 సబ్ సెంటర్లు, 9 పల్లె దవాఖానలు ఉన్నాయి. నిత్యం వాటిని పర్యవేక్షిస్తూ ప్రభుత్వ ఇచ్చే ప్రోగ్రాంలపై అవగాహన కల్పిస్తూ, రివ్యూ సమావేశం నిర్వహిస్తూ ఉన్నతాధికారులకు నివేదించాలి. నర్సంపేట మండలం, పట్టణంతో కలిపి సుమారు 72వేల జనాభా ఉంది. ఈ ఆస్పత్రిలో ప్రతి రోజు 70– 90ఓపీ చొప్పున నెలలో సుమారు వేయికి పైగా రోగులు చికిత్స కోసం వస్తుంటారు. ఇదిలాఉండగా.. సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రాంతాల్లో క్యాంపులను సైతం ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. రెగ్యులర్ వైద్యులు లేకపోవడంతో క్యాంప్‌లు కన్పించకుండా పోయాయని ప్రజలు పేర్కొంటున్నారు.


భాంజీపేట పీహెచ్‌సీ

ఉన్నతాధికారులకు నివేదించాం



భాంజీపేట ఆస్పత్రికి రెగ్యులర్ వైద్యుడు లేకపోవడంతో సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్న విషయం వాస్తవమే. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయూష్ వైద్యురాలితో సేవలు అందిస్తున్నాం. రెగ్యూలర్ వైద్యుడు లేదా, పూర్తి స్థాయిలో విధులు నిర్వహించే ఇన్‌చార్జ్ వైద్యుడిని నియమించాలని కోరుతూ ఉన్నతాధికారులకు విన్నవించాం.

– ప్రకాశ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

ఏఎన్‌ఎంలను విధుల్లోకి తీసుకోవాలి

పర్వతగిరి: ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లలో గతంలో విధులు నిర్వహించిన ఏఎన్‌ఎంలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లలో నాలుగు సంవత్సరాల పాటు అరకొర వేతనాలతో ఏఎన్‌ఎంలుగా విధులు నిర్వహించామని, కాంట్రాక్ట్ ముగియడంతో విధుల్లో నుంచి తొలగించారని తెలిపారు. ఇటీవల నూతనంగా ఏఎన్‌ఎంల రిక్రూట్‌మెంట్ కోసం జారీ చేసిన నోటిఫికేషన్‌లో పాత ఏఎన్‌ఎంలకు ప్రాధాన్యత ఇవ్వకుండా కొత్తగా కేవలం ఎస్టీ అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేశారని అన్నారు. పాత ఏఎన్‌ఎంలను మెరిట్ ఆధారంగా వెయిటేజీ ప్రకారం తీసుకున్న తర్వాతనే కొత్త వారికి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు పుష్పలత, ఎస్.లావణ్య, సీహెచ్.లక్ష్మి, రమణకుమారి, సరస్వతి, నాగమణి, రిత, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల మానవహారం

వర్ధన్నపేట: ఏఎన్‌ఎం పోస్టుల నోటిఫికేషన్ రద్దు చేయాలని శుక్రవారం వర్ధన్నపేట పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ఏఎన్‌ఎంలు మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 16 సంవత్సరాల నుంచి ప్రజలకు సేవ అందిస్తున్న ఎలాంటి గుర్తింపు, భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కష్ట కాలంలో కుటుంబాలను వదిలిపెట్టి కరోనా సోకిన ప్రజలకు వైద్య సేవలు అందించి తెలంగాణకు గుర్తింపు రావడానికి కీలక పాత్ర పోషించామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రెండో ఏఎన్‌ఎంలను గుర్తించి రెగ్యులరైజేషన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు దేవయాని, సునిత, రమాదేవి, రాణి, మయూర, అరుణ, ప్రసన్న, సుధ, కవిత, హేమలత, ఉషారాణి, విజయలక్ష్మి, అపరంజి తదితరులు పాల్గొన్నారు.


మానవహారం నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు

గిరిజన సంస్కృతికి ప్రతీక తీజ్

పర్వతగిరి: గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా తీజ్ పండుగ నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కేఆర్ నాగరాజు అన్నారు. ఈ మేరకు మండలంలోని గోరుగుట్టతండాలో గురువారం రాత్రి నిర్వహించిన బంజారా తీజ్ ఉత్సవాల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. గిరిజన సంప్రదాయ పద్దతులు బాగుంటాయని, గిరిజన దేవతలు సేవాలాల్, మేరమయాడిలను గిరిజనులు అధికంగా పూజిస్తారని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రావు, సునీల్‌రావు, రాఘవులు, కనకయ్య, భాస్కర్‌నాయక్, ఎంపీటీసీ సరోజన పాల్గొన్నారు.

రైతులు మెట్ట సాగుపై దృష్టి సారించాలి


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వీరన్న

ఖానాపురం: రైతులు వరి మెట్ట సాగు విధానంపై దృష్టి సారించాలని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ జి.వీరన్న సూచించారు. ఈ మేరకు మండలంలోని రాగంపేట గ్రామ పంచాయతీ ఆవరణలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరి, పత్తి పంటలలో గడ్డి మందల వాడకంపై అవగాహన సదస్సును శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గడ్డి మందుల వాడకం వలన కలిగే లాభ, నష్టాలు, అధికంగా వాడకం వలన పర్యావరణంలో కలిగే అనర్థాలపై రైతులకు వివరించారు. మెట్ట సాగు విధానం వలన కూలీల ఖర్చు తగ్గుతుందని, దమ్ము చేయడం వంటివి ఉండవని, తద్వారా ఖర్చు కూడా తగ్గిపోయి రైతులకు సమయం ఆదా అవుతుందన్నారు. అధిక నీరు వాడి బురద నాటు వేయడం వలన మిథేన్ అనే వాయువు విడుదలై పర్యావరణానికి హాని కలుగుతుందని తెలిపారు. మెట్ట వరిలో వరి విత్తిన 48 గంటల లోపు పెండిమాతిలిన్ 5.మి.లీ లీటరు నీటికి కలిపి భూమిలో తేమ ఉన్నప్పుడు పిచికారీ చేస్తే అన్ని రకాల కలుపు పుట్టకుండా సమర్థవంతంగా పని చేస్తుందన్నారు. ఈ సదస్సులో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఆర్‌బీఎస్ కన్వీనర్ వెంకట్‌రెడ్డి, జిల్లా సభ్యులు పూర్ణచందర్, సర్పంచ్ ఐలయ్య, రెడ్డీస్ ఫౌండేషన్ మేనేజర్ రాజు, ఏఈఓ సంధ్య, రైతులు పాల్గొన్నారు.

నెరవేరిన విలీన హామీ

- చెన్నారావుపేట మండలంలో పాతమగ్దుంపురం
- జీఓ 260 విడుదల చేసిన ప్రభుత్వం



సాక్షి ఎఫెక్ట్..

చెన్నారావుపేట: పాత మగ్దుంపురం గ్రామాన్ని చెన్నారావుపేట మండలంలో విలీనం చేస్తూ ప్రభుత్వం జీఓ 260ని శుక్రవారం విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నూతన జిల్లాల పునర్విభజనలో భాగంగా మగ్దుంపురం గ్రామాన్ని గ్రామ పంచాయతీ తీర్మానంతో నర్సంపేట మండలంలో కలిపింది. ఈ క్రమంలో పాత మగ్దుంపురం గ్రామాన్ని వేరు చేయాల్సి ఉంది. అధికారుల తప్పిదంతో పాత మగ్దుంపురం కూడా నర్సంపేటలో విలీనం చేశారు. పోలీస్ స్టేషన్, ఆస్పత్రి చెన్నారావుపేటలో, రెవెన్యూ, గ్రామ పంచాయతీ పాలన, వ్యవసాయ శాఖ నర్సంపేటలో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాత మగ్దుంపురం గ్రామాన్ని నర్సంపేటలో ఎలా విలీనం చేస్తారని ప్రజలు ఆందోళన చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ సర్పంచ్‌ను ఏకగ్రీవం చేస్తే పాత మగ్దుంపురం గ్రామాన్ని చెన్నారావుపేట మండలంలో కలుపుతామని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హామీ ఇచ్చారు. హామీ నెరవేరకపోవడంతో విద్యార్థులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఈ నెల 6న సాక్షిలో 'విలీన హామీ అమలయ్యేనా' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎమ్మెల్యే పెద్ది.. సీఎం కేసీఆర్‌ను ఒప్పించి జీఓ విడుదల చేయించారు. పాతమగ్దుంపురం గ్రామాన్ని నర్సంపేట మండలం నుంచి చెన్నారావుపేట మండలంలో విలీనం చేయించినందుకు ఎమ్మెల్యే పెద్దికి సర్పంచ్ లావణ్యాసాంబయ్య, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



'సాక్షి'లో ప్రచురితమైన కథనం

రైతులను దగా చేస్తున్న బీఆర్‌ఎస్

- బొంపెల్లి దేవేందర్‌రావు


కాంగ్రెస్ పథకాలను వివరిస్తున్న నాయకులు

వర్ధన్నపేట: రైతుల పక్షపాతి అని చెప్పుకుంటూ బీఆర్‌ఎస్ రైతులను దగా చేస్తుందని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు దుయ్యబట్టారు. శుక్రవారం వర్ధన్నపేట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు చెందాల్సిన పనిముట్లు, విత్తనాల సబ్సిడీ, డ్రిప్ సిస్టం సబ్సిడీని, ఉచిత ఎరువులను రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది ఏళ్ల నుంచి మరిచిపోయిందన్నారు. సీఎం కేసీఆర్ అసమర్ధ పాలనకు ఇదో మచ్చు తునక మాత్రమేనన్నారు. కోనారెడ్డి చెరువు కట్ట మూడేళ్ల క్రితం తెగిపోతే తూతూ మంత్రంగా రూ.40 లక్షలు మంజూరు చేసి రింగ్ బండ్ వేశారన్నారు. తదుపరి మరమ్మత్తుల కోసం రూ.14 కోట్లు మంజూరు చేయించి చేపట్టిన పనులు సంవత్సరం దాటుతున్నా ఎక్కడివక్కడే ఉన్నాయని ఆరోపించారు. ఇటీవల మత్తడిని తొలగించడంతో కోతకు గురైన పొలాలను పరిశీలించినవారే లేరని పేర్కొన్నారు. ఎద్దు సత్యనారాయణ, కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, సమ్మెట సుధీర్‌గౌడ్, కొండేటి బాలకృష్ణ, రవీందర్, శ్రీనివాస్‌గౌడ్, కుమారస్వామి, రవీందర్‌రెడ్డి, సమ్మయ్య, రాజు, శ్రీరామోజు బ్రహ్మచారి పాల్గొన్నారు.

గడపగడపకు మన కాంగ్రెస్

చెన్నారావుపేట: మండంలోని లింగాపురంలో శుక్రవారం యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేముల ఇంద్రదేవ్ ఆధ్వర్యంలో గడప గడపకు మన కాంగ్రెస్ కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా, వచ్చే ఎన్నికల్లో ప్రజలను మోసం చేయడానికి వస్తారని ప్రజలకు వివరించారు. దొంతి మాధవరెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. జిల్లా కార్యదర్శి మొగిళి వెంకట్‌రెడ్డి, యాకయ్య, సదయ్య, సర్పంచ్ రమేష్, కుమారస్వామి ఉన్నారు.

నీటిని విడుదల చేయాలి

ఖానాపురం: పాకాల సరస్సు ఆయకట్టు పరిధిలో జోరుగా వరినాట్లు పడుతున్నాయి. కానీ, జాలుబంధం పరిధిలోని గంగదేవిబోడు శివారులో నాట్లు వేయడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంగదేవిబోడు శివారులో సుమారు 30 ఎకరాలు భూములకు ఇప్పటి వరకు జాలుబంధం కాల్వ తూము ద్వారా నీటి విడుదల చేయడంలేదని రైతులు సారయ్య, కిషన్, విజయ్, రవి, జోగ్య, యాకయ్య, రాజు, వీరన్న, మల్లేశ్, ఈర్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి విడుదల చేసి పంటల సాగుకు సహకరించాలని ఇరిగేషన్ డీఈ, ఏఈని కోరినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

సృజనాత్మకత వెలికితీసేందుకే సైన్స్ ఫెయిర్


ఎగ్జిబిట్ గురించి వివరిస్తున్న విద్యార్థులు


మాట్లాడుతున్న మమతారఘువీర్

సంగెం: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్ దోహదపడుతుందని తరుణి స్వచ్ఛంద సంస్థ చైర్‌పర్సన్ మమతా రఘువీర్ అన్నారు. తీగరాజుపల్లిలో తరుణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో వివిధ పాఠశాలలకు చెందిన 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సీనియర్ విభాగంలో హైడ్రో ఇంజిన్ (వర్షిత్, మోడల్ స్కూల్ గవిచర్ల), హౌజ్ స్టీమ్స్ (భరత్, జడ్పీహెచ్ఎస్ మొండ్రాయి), వ్యాక్యూమ్ క్లీనర్ (శ్రీవల్లి, భగత్, జెడ్పీహెచ్ఎస్ కాపులకనిపర్తి), జూనియర్ స్థాయిలో సీడ్ డిస్పెన్సర్ (జి.ధనుష్, సిద్ధార్థ స్కూల్, మొండ్రాయి), మంకీ గన్ (ఎ.ఓంకార్, నోటరేడామ్, తీగరాజుపల్లి), స్టూల్ మోడ్ విత్ ప్లాస్టిక్ బాటిళ్లు (బి.మనోజ్ నోటేరే డామ్) వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ వసుధ, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, తరుణి స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రేషన్ డీలర్లు


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీలర్లు

పర్వతగిరి/వర్ధన్నపేట: రేషన్ డీలర్ల కమీషన్ పెంచుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకోవడంపై వర్ధన్నపేట నియోజకవర్గ రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట, పర్వతగిరి మండలాల రేషన్ డీలర్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌ను శుక్రవారం హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరూరి రమేష్ మాట్లాడుతూ రేషన్ డీలర్ల కమీషన్‌ను క్వింటాకు రూ.70నుంచి రూ.140కి పెంచడం హర్షణీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్లకు రూ.5లక్షల బీమా, ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ



రాయపర్తి: మండలకేంద్రంతోపాటు మండలంలోని కాట్రపల్లిలో ఇటీవల కుటుంబ సభ్యులు మృతిచెందినవారితోపాటు,చ చికిత్సపొంది విశ్రాంతి తీసుకుంటున్న కుటుంబాలను శుక్రవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా మండలకేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు భల్లెం యాదగిరి కాలిగాయంతో చికిత్సపొందగా పరామర్శించారు. కాట్రపల్లి గ్రామానికి చెందిన గుండ్లపల్లి అశోక్‌గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, రైతుబంధు మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, సర్పంచ్ గారె నర్సయ్య, ఎంపీటీసీ ఐత రాంచందర్, మండల ప్రధానకార్యదర్శి పూస మధు, సుధాకర్, సింహాద్రి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత

వర్ధన్నపేట: ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లు కూలిపోయిన వారిని, పైకప్పు పోయిన బాధిత కుటుంబాలకు ప్రముఖ అంతర్జాతీయ అమెజాన్ సంస్థ ప్లాస్టిక్ పరదాలు, దోమ తెరలు, బెడ్ షీట్లు, ప్లేస్‌లు, బ్రష్‌లు తదితరవాటితో కూడిన కిట్ బాక్స్‌లను 181 మంది కుటుంబాలకు శుక్రవారం బాలవికాస ఆధ్వర్యంలో వర్ధన్నపేట పట్టణంలో అందచేశారు. ఈ సందర్భంగా బాలవికాస ప్రోగ్రాం ఆఫీసర్ జ్యోతి మాట్లాడారు. వార్డు కౌన్సిలర్ తోటకూరి రాజమణి, కడారిగూడెం సర్పంచ్ మంద సతీష్, బాలవికాస ప్రతినిధులు రాణి, ఫాతిమా, అనురాధ, స్వాతి పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

నల్లబెల్లి: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో విజేతలుగా నిలిచిన నల్లబెల్లి హైస్కూల్ విద్యార్థులు సట్ల మధురిత, వక్కల అంకితలను హెచ్ఎం రామస్వామితోపాటు ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. సట్ల మధురిత ప్రథమ స్థానం, ఉపన్యాస పోటీల్లో వక్కల అంకిత తృతీయస్థానంలో నిలిచినట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకుల సంబురాలు

చెన్నారావుపేట: చెన్నారావుట గ్రామ శివారులోని పాకాల వాగుపై చెక్ డ్యామ్, బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో బీఆర్‌ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. వైస్ ఎంపీపీ, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కంది కృష్ణారెడ్డి మాట్లాడుతూ పాకాల వాగుపై వంతెన నిర్మించడం చెన్నారావుపేట మండల ప్రజలు, రైతుల చిరకాల కోరిక అన్నారు. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి రూ.18.68 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. జెడ్పీటీసీ బానోతు పత్తినాయక్, సర్పంచ్ కుండె మల్లయ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మహ్మద్ రఫీ, తూటి శ్రీనివాస్, కంది కృష్ణచైతన్య పాల్గొన్నారు.

వాషింగ్ మిషన్ వితరణ

రాయపర్తి: మండలంలోని కాట్రపల్లిలో ఉన్న మస్జీద్ ఏ పైమున్నీసా మజీద్‌కు అదే గ్రామానికి చెందిన యాకూబ్‌పాషా తన తల్లి రజియా జ్ఞాపకార్థం వాషింగ్ మిషన్‌ను శుక్రవారం అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎండీ అన్వర్, షరీఫ్, సత్తార్, యాకూబ్‌పాషా, బాషా, అబ్దుల్లా ఉన్నారు.

నా మట్టి.. నాదేశం

నర్సంపేట రూరల్ : ఆజాది కా అమృతోత్సవంలో భాగంగా ఆగస్టు 09 నుంచి 30 వరకు నా మట్టి.. నాదేశం కార్యక్రమాన్ని భారతీయ జనతా పార్టీ నాయకులు మండంలోని మహేశ్వరం శివాని హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. బీజేపీ నాయకులు మట్టి సేకరించి ఢిల్లీకి పంపిచడం జరుగుతుందన్నారు. వడ్డెపల్లి నర్సింహారాములు, శ్రీనివాస్, ప్రతాప్, రాజేందర్, మహేష్‌గౌడ్, సందీప్, ఠాకూర్ విజయ్‌సింగ్, సప్తగిరి, నాగరాజు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల రేడియో కార్యక్రమం


గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు


దుగ్గొండి: మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం ఆకాశవాణి వరంగల్ కేంద్రంలో చిన్నారి లోకం కార్యక్రమంలో పాల్గొని ప్రతిభచాటారు. గైడ్ టీచర్ సుమలత పర్యవేక్షణలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ గీతాలు, మానవా నీకిది న్యాయమా నాటకం, పరిసరాల పరిశుభ్రతపై సంభాషణ, పర్యావరణంపై కవితలు అంశాలతో ఆకాశవాణిలో కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారిలోకంలో భాగంగా ఈనెల 13న ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఆకాశవాణి వరంగల్ కేంద్రం ద్వారా ప్రసారం అవుతుందని హెచ్ఎం దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను గైడ్ టీచర్ సమలతను ఉపాధ్యాయులు శ్రీనివాస్,మాధవి, సుధీర్‌కుమార్, వెంకట్రావ్, కరంచంద్, కమల, నాగరాజు అభినందించారు.

ఇంటింటా జాతీయ జెండా ఎగురవేయాలి

చెన్నారావుపేట: స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని ఇంటింటా జాతీయ జెండాను ఎగురవేయాలని ఎస్‌పీఎం అనిల్‌కుమార్ అన్నారు. ఈ మేరకు స్థానిక పోస్టాఫీస్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా సూపరింటెంటెంట్ నర్సింహస్వామి ఆదేశాల మేరకు శుక్రవారం కార్యాలయంలో ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటిపై జెండా ఎగురవేయడానికి అందుబాటులో పోస్టాపీస్‌లో రూ. 25 లకే జెండా విక్రయించడం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా కూడా అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ వడ్లకొండ రాజుకుమార్ గౌడ్, మండ రంజిత్, క్రాంతికిరణ్, నిఖిల్ ఉన్నారు.


జెండాలు ప్రదర్శిస్తున్న పోస్టల్ సిబ్బంది

నిట్ విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం



చెన్నారావుపేట:నిట్‌లో సీటు సాధించిన విద్యార్థి సన్నీ చదువు కోసం దాత శుక్రవారం రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. మండలంలోని బాపునగర్ గ్రామానికి చెందిన సన్నీ పరిస్థితిపై 'దాతలు దయచూపరూ..!' శీర్షికన ఇటీవల 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన పలువురు ఆర్థిక సాయం చేశారు. ఇటీవల నియోజవర్గ నాయకుడు రాణా ప్రతాప్‌రెడ్డి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు. మందపల్లి పాఠశాల హెచ్ఎం కర్ణకంటి రామ్మూర్తి రూ.5వేలు అందించారు. దాతలు సాయం అందించడానికి 9052001950 నంబర్‌ను సంప్రదించాలని, ఎస్‌బీఐ అకౌంట్ నంబర్ 62202764705, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0021352కి సాయం అందించాలని సన్నీ కోరాడు.